


# చండశాసన మహారాజు

మా తాతయ్యగారు మహా చండశాసనుడు. ఎదుటి మనిషిని తిట్టకుండా నాలుగు మాటలు మాట్లాడ్డం ఆయనకి చేతకాదు. అరవైదాటిన తమ్ముళ్ళనీ నలభై దగ్గరపడిన కొడుకులనే కాకుండా అల్లుళ్ళనీ అడపాదడపా ఇంటికొచ్చిన అతిథులనీ కూడా తిడుతూనే ఉంటారు.

వంట మనుషులని పనివాళ్ళనీ అయితే చెప్పనక్కర్లేదు. ప్రతిరోజూ తిట్ల దండకమే. కూరగాయలమ్మేవాళ్ళూ పోస్ట్‌మేనూ గడగడలాడుతూ వస్తారు మా ఇంటికి. ప్రాణాలు అరచేత్తో పట్టుకుని పని ముగించుకుని బతుకు జీవుడా అని పారిపోతారు.

ఆ తిట్టే విధానంలో కూడా వైవిధ్యం కనబరుస్తూ ఉంటారు. మేము కనిపించగానే పిలుస్తారు. 'నువ్వు ఏం చదువుతున్నావే?' అని అడుగుతారు. 'ఆరో క్లాసు' అంటాను. 'అబ్బో ఆరో క్లాసా! పరవాలేదే–నేనింకా ఏ నాలుగో క్లాసో చదువుతున్నావేమో అనుకున్నా. సరేలే, లోపలికి వెళ్ళి నాకో చుక్క కాఫీ తెచ్చిపెట్టు' అంటారు.

మెచ్చుకున్నారు కదా అని సంబరంగా లోపలికి పోయి కాఫీ తెచ్చి ఇస్తాం. 'నువ్వే క్లాసు?' అని అడుగుతారు. 'ఆరో క్లాసు' అంటే –'ఎద్దులా ఇంకా ఆరో క్లాసేనా? నేనే

ఎనిమిదో క్లాసో అనుకున్నా' అని తిడతారు. ఎంత మేధావులం అయినా కాఫీ తెచ్చే లోపల రెండు క్లాసులెలా చదివేస్తాం?

కొడుకులనీ తిడుతూనే ఉంటారు మనవల ఎదుట.

ఒకసారి మా బాబాయ్ వాళ్ళ అబ్బాయి జీడిపప్పు పాకం తెమ్మంటే వేరు సెనగపప్పు పాకం తెచ్చాడుట. వాడేమో అది చూసి 'నాన్నా నీకీ మధ్య శరీరం పెరిపోతోంది, మేధస్సు తరిగిపోతోంది' అన్నాడుట.

"మా నాన్నున్నాడే, మా కొంప ముంచుతున్నాడు. మొన్న నన్ను 'ఒరేయ్ శరీరం పెంచేస్తున్నావు, తెలివి తగ్గిపోతోంది' అని తిట్టాడు ఎందుకో. అదీ వెధవ విన్నట్లున్నాడు" అని సణుక్కున్నాడు మా బాబాయ్.

ఇక అల్లుళ్ళు? పండగకి పిలిచారు. కొత్త బట్టలు పెట్టారు. షడ్రసోపేతమైన భోజనం పెట్టారు. బాగానే ఉంది. అంతటితో ఆగక, ఏం సినిమా చూడాలో కూడా ఆయన పెత్తనమేనా?

'పెళ్ళి కానుక' సినిమాకి వెళ్తాం అంటే తాటెత్తున లేచి –"మండినట్లేవుందా సినిమా! అద్దెకి చేరినవాడు బుద్ధిగా ఉండక ఇంటివారి అమ్మాయిని ప్రేమించడమే బుద్ధి తక్కువ. ఇకాతర్వాత చెల్లెల్ని ప్రేమించి అక్కని పెళ్ళిచేసుకోవడం ఏమిటి? హవ్వ. ఆ పిచ్చి సినిమా మీకెందుకు, లక్షణంగా 'సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణికి వెళ్ళండి" అని చంపుకు తిన్నారు.

"సరే అలాగే అన్నాం" తప్పించుకుందామని.

"జట్కాలో తీసికెళ్ళి టిక్కెట్టు కొని హాల్లో కూర్చోబెట్టి మరీ వచ్చారు మా మావగారు. ఇట్లా అయితే పండగలకి రావడం కష్టం సుమండీ. మేము చిన్నవాళ్ళమా! చితక వాళ్ళమా? ఇంకో నాలుగేళ్ళుపోతే అల్లుళ్ళు వచ్చేస్తారు"– అని వాపోయేవాళ్ళు.

వంటావిడకి దినదినగండం నూరేళ్ళాయుష్షు. వస్తూవస్తూ గుళ్ళో దణ్ణం పెట్టుకుని మరీ వచ్చేది. తాతయ్య కంచంముందు కూర్చుని భోజనం చేసి లేచేదాకా ఆవిడ గుండెలు పీచుపీచుమంటూనే ఉండేవి.

అన్నం బిరుసైతే 'ఏవిటిది నీ బొంద, మేకుల్లా ఉంది అన్నం' అనేవారు. కాస్త మెత్తనైతే 'ననుబాయ సంకటి చేసి పెట్టావు' అని తిట్టేవారు. 'కూర పొయ్యి మీద పడేసి

పెత్తనానికిపోయి ఉంటావు. అది కాస్త మాడి అఘోరించింది" అని విసుక్కునేవారు. పులుసులో ముక్కలు ఎక్కువైతే 'తేరగా కూరలున్నాయని నీ ఇష్టం వచ్చినట్లు పడేశావు. ఏడాదిలో ఆరు అధిక మాసాలు అన్నట్లున్నాయి పులుసులో ముక్కలు' అనే వారు. అలా అన్నారు కదా అని మర్నాడు తక్కువ వేస్తే 'ఎవరైనా పిల్లలున్నారేమో నా కళ్ళజోడు తెమ్మను. పులుసులో ముక్కలు వెతుక్కుంటాను' అనేవారు.

భోజనం విషయంలో ఆయనకు మంచి ప్రమాణాలుండేవి. నెయ్యి కర్పూరంలా ఉండాలిగానీ కంపుకొట్టకూడదు. పాలు బొట్టుపెట్టుకునేలా ఉండాలి. పెరుగు కంచంలో వేస్తే రాయిలా నిలబడాలి. తెరచాపలా అల్లల్లాడకూడదు. వంటింట్లో తిరగమోత వేయిస్తే వాకిట్లో యజమానికి తెలియాలి. పులుసు కాగుతుంటే అటు నాలుగిళ్ళవాళ్ళకీ ఇటు నాలుగిళ్ళవాళ్ళకీ ఆ సువాసన తెలియాలి' అంటూ చెప్తూనే ఉండేవారు.

ఆయన భోజనం ముగించి లేవగానే ఆడవాళ్ళందరూ 'హమ్మయ్య' అనుకునేవారు. వంటావిడ గాల్లో దణ్ణాలు పెట్టుకునేది.

ఇక మా ఇంటికి వచ్చే పోస్టుమేను అసలే అర్భకం ప్రాణి. ఈయన ధాటీకి తట్టుకోలేక గుడ్లు తేలేసేవాడు. ఉత్తరాలు వచ్చినా రాకపోయినా విధిగా ఓసారి కనిపించి వెళ్ళాలి.

'ఎందుకండీ' అంటే-'ఏమైనా ఉత్తరాలు వచ్చాయేమో అని గోతికాడి నక్కలా నీకోసం ఎదురుచూస్తుంటానా? నువ్వు ఓసారి కనిపిస్తే ఇక ఎదురుచూడ్డం ఆపి నిద్రపోతాను' అనేవారు.

'ఉత్తరాలు లేవండీ' అని చెప్పడానికి వస్తే అతన్ని దొరకబుచ్చుకుని నాకు ఉత్తరాలు లేవా? సరేలే ఆపై కార్డెవరిది?" అని అడిగి తెలుసుకుని-

"ఓహో ఆయనదా? ఆయన నాకు బాగా తెలుసు. ఎవరు రాశారు?" అని అడగడం.

"ఏమోనండీ, ఉత్తరం ఇవ్వడమేగానీ ఎవర్రాశారో ఏం రాశారో చూడడం తప్పుకదండీ. నేనలా చెయ్యకూడదు" అని పోస్టుమేను అంటే-

"అవున్లే. నువ్వు పరాయివాడివి. నువ్వు చదవకూడదు. మేమంతా ఒక్కటే. నేను చదవచ్చు. నా చేతికివ్వడం నీ ఉద్యోగధర్మానికి విరుద్ధం అయితే అట్లా దూరంగా

పట్టుకో, చదువుతా" అని పీకి పాకానపెట్టి ఒకటి రెండు కార్డులు చదివి మరీ పంపుతారు.

ఆయనంత చండశాసనుడైనా అందరూ ఆయనని ఎంతో గౌరవిస్తారు. కారణం ఏమిటీ అంటే -కోపం ఎక్కువేగానీ మనసు మంచిది. ఆయన చేతికి ఎముకలేదు. అడిగినవాడికి లేదనరు. కష్టంలో ఉండి సహాయం అడిగితే తల తాకట్టుపెట్టి అయినా వాళ్ళను ఆదుకుంటారు. అందుకే ఎన్ని అన్నా అన్నీ దులిపేసుకుంటారు అయినవాళ్ళూ, కానివాళ్ళూ కూడా. పైగా 'చల్లని మనసు గల మహారాజు' అంటారు.

* * *